రాత్రి పది గంటలు కావస్తుంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రయాణీకులతో రద్దీగా వుంది. నా లగేజినంతా ఒక ప్రక్కగా సర్దుకుని రైలు రాకకోసం ఎదురుచూస్తూ నుంచోని వున్నాను. ఇప్పుడు నా మనస్సు ఆనందంతో ఉవ్వెత్తున ఎగిసిపడే కడలి తరంగంలా వుంది. నా ఆనందానికి కారణం మరికొన్ని గంటల్లో నా వాళ్ళని, నా ఊరిని, నాకు బాగా యిష్టమైన అమ్మలాంటి గోదావరిని, అన్నిటికంటే మించి వెన్నెల్లో గోదారిలా మెరిసిపోయే గంగని చూడబోతున్నాను.

ఇపాటికి గంగ, గోపన్న పిల్లాపాపల్తో హాయిగా జీవితం గడుపుతూ ఉంటారు. గంగ పెళ్ళికి రమ్మని నరసయ్య మావయ్య చాలాసార్లు ఫోన్లు చేశాడు. కాని వీలు లేక రాలేకపోయాను. జరిగిన సంవత్సరంనుంచి మావయ్య ఒకటే గొడవ "నీకు పెళ్ళీడొచ్చింది. నిన్ను ఒక ఇంటివాణ్ణి చేస్తే నా బాధ్యత తీరిపోతుంది. నీకోసం యిక్కడ బంగారంలాంటి సంబంధం ఎదురుచూస్తోంది." అంటూ ఫోన్లమీద ఫోన్లు ఉత్తరాలు మీద ఉత్తరాలు రాసిపడేశాడు. ఇక తప్పించుకునే పరిస్థితి లేక బయలుదేరాను. వీళ్ళందర్నీ చూడబోయే క్షణం కోసం నా మనస్సు ఒకటే ఆరాటపడ్తూ వుంది. ఆ ఉత్కంఠమైన సన్నివేశం నామదిలో మెదిలేసరికి నా అణువణువూ ఉద్వేగంతో నిండిపోయింది.

నా ఆలోచనల్ని చెదరగొడ్తూ శబ్దం చేసుకుంటూ రైలు వచ్చి ఆగింది. నాకు కేటాయించిన బెర్త్‌దగ్గర నా సామానంతా సర్దుకుని కూర్చున్నాను. మరికొంత సమయం జరిగిన తరువాత రైలు కదిలింది. క్రమేపి రైలు వేగం పుంజుకుంది. కిటికిలోంచి వీస్తున్న గాలికి నాకు చలి పుట్టింది. బ్యాగ్ తెరిచి దుప్పటి తీస్తుండగా పాత ఫొటో ఒకటి నాకంట పడింది.

అది మా ఫ్యామిలీ ఫొటో. దేశంకాని దేశంలో అయినవాళ్ళకి దూరంగా ఉన్న నేను వాళ్ళు గుర్తుకొచ్చినప్పుడల్లా ఆ ఫొటోని చూస్తూ తృప్తి పడేవాణ్ణి. వీళ్ళకి నాకు ఏ విధమైన రక్తసంబంధం లేకపోయినా నా కోసం, నా ఉన్నతికోసం, నా భవిష్యత్తుకోసం, వాళ్ళ శ్రమని, ఆనందాన్ని త్యాగంచేసి నన్నీస్థితికి చేర్చిన మహోన్నతమైన వ్యక్తిత్వంగల మనుషుల ఫొటో అది.

ఆ ఫొటోలో నాతోపాటుగా నరసయ్య మావయ్య, సీతత్త, వాళ్ళ ఒక్కగానొక్క కూతురు గంగ, మేమందరం కలిసి, నేను పదవ తరగతి పాస్ అయినప్పుడు గోదారి ఒడ్డున తీయించుకున్న ఫొటో అది.

ఆ ఫొటోని చూడగానే నా మనస్సంతా తియ్యని జ్ఞాపకాలతో నిండిపోయింది. ఆ ఫొటోని నా హృదయానికి హత్తుకున్నాను. ఆ స్పర్శ నా మనస్సు పొరల్లో నిక్షిప్తమైన జ్ఞాపకాల దొంతరని తట్టి లేపుతున్నాయి.

రైలు వేగంగా ముందుకు దూసుకుపోతుంది. నా మనస్సు మాత్రం గడిచిన కాలంలోకి పరుగు తీసింది.

* * *

ఉభయ గోదావరి జిల్లాల్ని వేరుచేస్తూ ప్రవహిస్తున్న పవిత్ర వశిష్ఠ గోదావరి నదిలో రెండు గోదావరి పాయల మధ్య ద్వీపంగా ఉన్న 'అయోధ్య లంక' గ్రామం మాది.

# నేను-గంగ-గోదారి



\- గంటా కళ్యాణీనాయుడు

మా ఊరినుండి పట్టణానికి వెళ్ళాలంటే అటు రేవు దాటిన తర్వాత రెండు మైళ్ళు నడిస్తే తూర్పుగోదావరి జిల్లాలోని 'రాజోలు' చేరుకోవచ్చు. ఇటు రేవు దాటిన తర్వాత పశ్చిమ గోదావరి జిల్లాలో వున్న 'గంగడు పాలెం'లో బస్సు ఎక్కి పది కిలోమీటర్లు ప్రయాణం చేస్తే పాలకొల్లు చేరుకోవచ్చు. చదువుకోసం స్కూలుకి పిల్లలు రాజోలు వెళ్తారు. కాలేజికి కుర్రోళ్ల పాలకొల్లు వెళ్తారు.

పాతిక గడపలు దాటని మా ఊరు నవనాగరికతకి దూరంగా స్వచ్ఛమైన పల్లె వాతావరణం ఉట్టిపడ్తూ వుంటుంది.

నాన్న సింహాచలం, నరసయ్య మావయ్యలు ప్రాణస్నేహితులు. యిద్దరి మధ్య ఎటువంటి బంధుత్వం లేకపోయినా 'బావ...బావ...' అంటూ వరసలు కలుపుకొని పిల్చుకోవటం వాళ్లకి అలవాటు.

మేము గంగపుత్రులం (మత్స్యకారులు) కాబట్టి మా జీవనాధారం చేపల వేట. గోదారి 'పోటు'లో ఉన్నప్పుడు చేపలు బాగానే పడతాయి. గోదారి 'పాటు'లో ఉంటే మాత్రం వేటకోసం దగ్గర్లోని అంతర్వేది సముద్రంలోకి వెళ్లవల్సిందే!

నాకు తెల్సినప్పటికీ అమ్మ ఈ భూమ్మీద లేదు. తమలపాకులు తుంపే పనిలోకి వెళ్ళి పాము కరిచి చచ్చిపోయిందంట! అప్పటినుండి నేను నాన్నదగ్గరే పెరిగాను. అందరి పిల్లలూ అమ్మ చంకలు ఎక్కి తిరుగుతూంటే నాకు ఏడుపొచ్చి అమ్మ గుర్తుకొచ్చేది. ఒక సారైతే ఉండబట్టలేక నాన్నని అడిగాను "నాన్న...అమ్మ ఎలా వుండేది!" అని. నా మాటకి నాన్న చిన్నగా నవ్వి నన్ను తన భుజాలపైకి ఎత్తుకొని గోదారి గట్టుకి తీసుకొచ్చాడు. గోదారిని చూపిస్తూ "అచ్చం ఈ గోదారి తల్లిలాగే నిండుగా వుండేదిరా మీ అమ్మ!" అన్నాడు. నాన్న కళ్ళల్లో సన్నని కన్నీటి పొర.

నిండుగా పొంగి ప్రవహిస్తున్న గోదారిని చూసేటప్పటికి నా హృదయం వరద గోదారిలా ఉప్పొంగింది. "అమ్మా..."అంటూ మైమరచి బిగ్గరగా అరిచాను. నా పిలుపు ఆలకించినట్లుగా గోదారిలో నుండి పిల్లతిమ్మెర ఒకటి నా హృదయానికి చల్లగా తాకింది. ఆ స్పర్శ అచ్చం అమ్మ స్పర్శలాగే ఉంది. అప్పటినుండి అమ్మంటే గోదారని నాలో ఒక తియ్యని జ్ఞాపకంగా నిక్షిప్తమైపోయింది. ఎప్పుడు అమ్మ గుర్తుకొచ్చినా గోదారిని చూస్తే నా దిగులంతా మాయమైపోయేది.

వారం రోజులుగా గోదావరి పాటులో వుంది. నీరు ఉధృతి తగ్గి చేపలు దొరకడం లేదు. ఏ రోజున చేపలు దొరక్కపోయినా ఆరోజు సంపాదన లేక పస్తులుండవల్సిందే! యిక తప్పనిసరి పరిస్థితులలో అంతర్వేది సముద్రంలోకి నాన్న, మావయ్యలు వేటకి వెళ్లాలని అనుకున్నారు. కానీ, ఆ రాత్రి ఒంట్లో బాగాలేకపోతే మావయ్య వేటకెళ్ళడం మానేసాడు. నాన్న ఒక్కడే సముద్రంలోకి వెళ్ళాడు.

నాన్న వేటకి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా ఆకాశం మారిపోయింది. బలమైన గాలితో వర్షం కురవడం ప్రారంభించింది. 'బంగాళాఖాతంలో వాయుగుండం'అని అప్పుడే రేడియోలో వార్తలు వచ్చాయి. నాన్న గురించి మా అందరిలో ఒకటే భయం. మా భయం నిజమయ్యింది. నాన్న యిక తిరిగి రాలేదు. సముద్రంలో కలిసిపోయాడు. అప్పటినుండి మావయ్య ఇంట్లోనే ఉండిపోయాను. నా ఆలనాపాలనా మావయ్యే చూసేవాడు. అమ్మానాన్నల గురించి నేను దిగులుగా ఉంటే మావయ్య నన్ను ఓదార్చేవాడు. నన్ను ఎత్తుకుని గోదారిలో కట్టేసి వున్న తన పడవలో కూర్చోబెట్టుకుని మంచి మంచి కథలు చెప్పి ఆ ధ్యాసనుండి నన్ను మరల్చేవాడు.

ఆదివారం వస్తే గంగడుపాలెం నుంచి మావయ్య చెల్లెలు కొడుకు గోపన్న వచ్చేవాడు. గోపన్న యింటికి

వచ్చినప్పుడల్లా సీతత్త గంగతో "గంగా... నీకు కాబోయే పెనిమిటి వచ్చాడే...చెంబుతో నీళ్ళివ్వు" అనేది. ఆమాట గంగకి అర్థంకాకపోయినా ముసిముసిగా నవ్వుకుని నీళ్ళిచ్చేది.

మేము ముగ్గురం చద్దన్నం తిన్న తర్వాత గోదారి మీదకి షికారుకి బయలుదేరేవాళ్ళం. ముందుగా మేము చేసే పని గోదారి గట్టున ఉన్న మామిడిచెట్టు కాయలు కోసుకోవడం. ఆ చెట్టు గోదారిలోకి వంగి కాయలు నీటిని తాకుతూ ఉండేవి. గోపన్న ఆ చెట్టు ఎక్కి చౌడుపుగా కాయలు కోసేవాడు. యింటి దగ్గర నుండి తెచ్చిన ఉప్పుకారం పొట్లం విప్పి నంజుకుని పళ్ళు పులిసేవరకూ కాయలు తినేవాళ్ళం. తర్వాత గోదారిలో దోసిళ్ళతో నీళ్ళు తాగి తర్వాత యిసుక తిన్నెల్లోకి నడిచేవాళ్ళం.

ఆ ఇసుక తిన్నెల్లో దొరికే రంగురంగుల గులకరాళ్ళు, రకరకాల గవ్వలు, ఆల్చిప్పలు ఏరుకుని ఆడుకొనేవాళ్ళం. ఎండ బాగా ఉన్నప్పుడు ఆ ఇసుకలో మా కాళ్ళు కాలిపోయేవి. నేను, గోపన్న మొండిగానే నడిచేవాళ్ళం. కానీ, గంగ ఏడ్చేసేది. నేను గంగని వీపు మీద ఎక్కించుకుని, ఒక చేత్తో గంగని, ఒక చేత్తో జారిపోతున్న నిక్కర్ని పట్టుకుని వడివడిగా నడిచేవాణ్ణి.

గోపన్న గాలిపటం చేయడంలో దిట్ట. రంగురంగుల కాగితాలతో ఇంద్ర ధనస్సులాంటి గాలిపటం తయారుచేసేవాడు. ఆ గాలిపటం పట్టుకొని గోదారి ఒడ్డున పరుగుపెట్టి ఎగరేసే వాళ్ళం. ఆకాశంలోకి కంటికి కనబడనంత దూరంగా ఎగిరిపోయేది ఆ గాలిపటం. ఆ గాలిపటాన్ని చూస్తూ గంగ కేరింతలతో చప్పట్లుకొట్టేది. గోపన్న గర్వంగా తన భుజాల్ని ఎగరేస్తూ "విమానం కూడా అంత పైకి ఎగరేలేదు" అనేవాడు. నాకు నిజమేననిపించేది. నేను కాగితం పడవలు తయారుచేసి మావయ్య నాటు పడవకి పోటీగా గోదారిలో వదిలేవాడిని.

ఊరంతా తిరిగి తిరిగి సాయంత్రం ఆరుగంటలకల్లా ఇంటికి చేరుకొనేవాళ్ళం. దాపుల్లో కాగివున్న ఉడుకు నీళ్ళతో మా ముగ్గురికి స్నానాలు చేయించేది సీతత్త. అప్పటికే బువ్వ తయారుగా ఉండేది. సీతత్త పెద్ద కంచంలో వేడివేడి అన్నం పెట్టి, అందులో పొగలుగ్రక్కే చేపల పులుసు వేసి కలిపి ముగ్గురికీ తినిపించేది. వర్రగా ఒక ముద్ద నోటికి తగిలేసరికి అప్పటివరకూ అలసిపోయి వున్న మా శరీరాలు యదాస్థితికి చేరుకొనేవి. లొట్టలు వేసుకుంటూ ఆబరాగా తినేసేవాళ్ళం. కడుపునిండా అన్నాలు తిన్న తర్వాత గోపన్నని మావయ్య వాళ్ళ ఊళ్ళో దించేసి వచ్చేవాడు.

ఇలా నా జీవితం కొన్ని సంవత్సరాలుపాటు ఆనందంగానే సాగింది.

నేను పదవ తరగతిలో ఉండగా, ఆయేడు వరద వచ్చి వెళ్ళిన తర్వాత మా ఊళ్ళో మలేరియా జ్వరాలు సోకినియ్యి. నేనూ ఆ జ్వరం బారినపడ్డాను. సకాలంలో సరైన వైద్యం అందక తీవ్రమైన జబ్బుతో నా రెండు కాళ్ళు జవసత్వాలు కోల్పోయి, చచ్చుబడిపోయాయి. నడిచే స్థితి లేదు. నా పరిస్థితికి మావయ్య, సీతత్తలు చాలా కలత చెందారు. కొన్ని రోజులకి జ్వరం తగ్గింది గాని, కాళ్ళు యింకా సరిగ్గా పనిచేయటం లేదు. మావయ్య ఎక్కడెక్కడినుండో రకరకాల తైలాలు తెప్పించి, రాత్రనక పగలనకా మర్దనా చేస్తూనే వుండేవాడు. నా కాళ్ళు కొంతకొంత మెరుగవుతూ వచ్చాయి. "పాపిష్టి రోగం నా బిడ్డకే రావాలా?" అంటూ రోగాన్ని తిడ్తూ కళ్ళనీళ్ళు పెట్టుకొనేది సీతత్త. మళ్ళీ తానే "దిగులుపడకు నాన్న... తొందర్లోనే నయమైపోతాది"అని నాకు ధైర్యం చెప్పేది.



**గోపన్న గాలిపటం చేయడంలో దిట్ట. రంగురంగుల కాగితాలతో ఇంద్ర ధనస్సులాంటి గాలిపటం తయారుచేసేవాడు. ఆ గాలిపటం పట్టుకొని గోదారి ఒడ్డున పరుగుపెట్టి ఎగరేసే వాళ్ళం. ఆకాశంలోకి కంటికి కనబడనంత దూరంగా ఎగిరిపోయేది ఆ గాలిపటం.**

నా పట్ల వీళ్ళు చూపిస్తున్న ఔదార్యానికి నా కళ్ళు చెమ్మగిల్లేవి. వీళ్ళందరూ మానవత్వం పరిమళించిన మనుషుల్లాగా...మనిషితనానికి నిలువెత్తు ఆకారం లాగ నాకు కనిపించేవారు. ఏవో తెలియని భావోద్వేగాలు నా గుండెను పిండేసి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేవి.

పరీక్షలు దగ్గరపడటంతో నేను బడికి వెళ్లాలని నిశ్చయించుకొని, మావయ్యతో చెప్పాను. మావయ్య రోజూ తన వీపుమీద ఎక్కించుకొని బడిలో దింపేవాడు. మళ్ళా సాయంత్రం తీసుకువచ్చేవాడు. మధ్యాహ్నం సీతత్త భోజనం తెచ్చి తినిపించేది. మరో రెండునెలలకి నా కాళ్ళు పూర్వపు వైభవాన్ని సంతరించుకున్నాయి. నడవగలిగాను. పట్టుదలతో చదివి పదవ తరగతి ప్రథమస్థానంలో ఉత్తీర్ణుడయ్యాను. అప్పటినుండి యిక నేను తిరిగి చూసుకోలేదు. అహర్నిశలు కష్టపడి చదివాను.

నా చదువుకోసం డబ్బుని చాలా కష్టపడి సమకూర్చేవాడు మావయ్య. ఇప్పుడు నేను లండన్‌లో ఉద్యోగం చేస్తున్నాను. నేను తొలిసారిగా లండన్ వెళ్ళవలసి వచ్చినప్పుడు డబ్బు సమకూరకపోతే గంగ ఎంతో ఇష్టపడి చేయించుకున్న బంగారు గాజులు అమ్మేసి నన్ను విమానం ఎక్కించాడు మావయ్య. ఇప్పుడు నేను లక్షల్లో సంపాదిస్తున్నాను.

ఈ మనుషుల్ని విడిచిపెట్టి పది సంవత్సరాలు దాటింది. నాకోసం సర్వాన్ని అర్పించిన ఆ మట్టిమనుష్యుల్ని చూడాలని నా మనస్సు తొందరపడుతుంది.

రైలు వేగంగా దూసుకుపోతూ వుంది. నేను జ్ఞాపకాలనుండి బయటకొచ్చాను. బలవంతంగా కళ్ళుమూసుకుని పడుకున్నాను. ఎప్పటికో నిద్దరపట్టింది.


❊ ❊ ❊


రైలు పాలకొల్లు స్టేషన్‌లో ఆగేసరికి ఉదయం ఎనిమిదిన్నర గంటలయ్యింది. ఆటో మాట్లాడుకుని మా ఊరికి బయలుదేరాను. అరగంట ప్రయాణం తర్వాత గంగడుపాలెం రేవుకి చేరుకున్నాను. నేను ఊహించుకున్న సుందర దృశ్యం నా కళ్ళముందు ప్రత్యక్షమయ్యింది.

ప్రకృతి రమణీయతను మొత్తం తనలోనే ఆపాదించుకుని తరగని సంస్కృతికి, తరతరాల సాంప్రదాయానికి ఆనవాళ్ళుగా జీవన వేదాన్ని వల్లిస్తున్నట్లు నిశ్చలంగా ప్రవహిస్తూ వుంది గోదారి. ఆతృతగా నా కాళ్ళు గోదారిలోకి నడిచాయి. మోకాలు లోతులోకి దిగి గోదారిలోకి నమస్కరించి మూడుసార్లు ఆ నీళ్లని నా నెత్తిపై చల్లుకొని పైకి వచ్చి రావిచెట్టు చాప్టామీద కూర్చున్నాను.

గోదారి మధ్యలో పడవ తెరతాప రెపరెపలతో యువతలకి వస్తూ కనపడింది. ఒకసారి చుట్టూవున్న పరిసరాల్ని పరికించి చూసాను. దూరంగా కనబడుతున్న ఇసుక తిన్నెలు, ఎండపడి బంగారపు రంగులో మెరిసిపోతున్నాయి. గోదారిలో వేసి ఉన్న రాళ్ళపై చాకలోళ్ళు బట్టలుతుకుతున్నారు. నేను కూర్చున్న రావిచెట్టు చాప్టాకి క్రిందగా నాయీ బ్రాహ్మణుడు సవరాలు చేస్తున్నాడు.

(మిగతా 27వ పేజీలో)



(18వ పేజీ తరువాయి)

సవరాలు చేయించుకునే వాళ్లందరూ చొక్కాలు విప్పేసి వరుసలో కూర్చొన్నారు. గోదారిలో ఒక ప్రక్కగా కొంతమంది కుర్రోళ్లు కేరింతలు కొడ్తూ స్నానాలు చేస్తున్నారు. ఆ పిల్లల్ని తప్పించుకుంటూ ఆడవాళ్ళు బిందెలతో నీళ్లు ముంచుకెళ్తున్నారు. గోదారి గట్టుమీద పల్లెపడుచులు కొడవలి, కత్తి, పార, తొలుకు, గునపం లాంటి పనిముట్లతో పనిలోకి వెళ్తున్నారు. అడుగడుగునా శ్రమైక జీవన సౌందర్యం ఉట్టిపడ్తూ వుంది ఆ వాతావరణం.

మరికొంత సమయం జరిగిన తర్వాత పడవ వచ్చి ఆగింది. జనం బిలబిలమంటూ దిగిపోయారు. నేవెళ్ళి పడవలో కూర్చున్నాను. ఆ పడవ సారంగి నా సామానంతా పడవలో సర్దేసాడు. ఒక్కొక్కరూ పడవ ఎక్కుతున్నారు. జనం నిండిన తర్వాత పడవ గోదారిలోకి మెల్లగా జారుకుంది. గోదారి మధ్యలో రాజమండ్రి నుండి అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి గుడికి యాత్రికులతో వెళ్తున్న లాంచీ మాముందు నుండి దూసుకుపోయింది. ఆ లాంచీలో టాపుపైన వున్న చిన్న పిల్లలు ఆనందంతో కేరింతలు కొడ్తూ మాకు టాటాలు చెప్తున్నారు. మేంకూడా ఆ పిల్లలకి టాటాలు చెప్పాం. వీస్తున్న గాలి తాకిడికి తెరచాప బలంగా లాగింది. ఆ పడవ సారంగి దానికి అనుగుణంగా తెడ్డువేసి అవతలకి పోనిచ్చాడు. పడవ గట్టుకి చేరింది.

నేను పడవదిగ్గానే నాకోసమే ఎదురుచూస్తూవున్న మావయ్య పరుగుపరుగున నా దగ్గరకొచ్చి నన్ను హత్తుకుపోయాడు. ఆ స్పర్శ నా గుండెల్ని తడిమి పలకరించినట్టుగా అన్పించింది. "ఏరా సూరి... బాగున్నావా!" అన్నాడు మావయ్య. మావయ్య ముఖంలో ఆనాటి కళలేదు. బాగా చిక్కిపోయాడు "బాగున్నాను మావయ్యా" అన్నాను. నా సామానంతా నెత్తిన పెట్టుకొని నడక ప్రారంభించాడు మావయ్య. నేను మావయ్యను అనుసరించాను.

ఇంటికి చేరాం. సామానంతా అరుగుమీద దించేసి "సీతా... ఎవరొచ్చారో చూడవే"అంటూ సీతత్తని కేకేశాడు మావయ్య. సీతత్త బయటకొచ్చింది. నన్ను చూడగానే సీతత్త కళ్ళు కాంతితో మెరిసాయి. ఆత్రుతగా నా గుండెల్ని తడిమి "దొరబిడ్డలా వున్నావురా సూరి... నా దిష్టే తగిలేలా వుంది"అంటూ మెటికలు విరిసింది సీతత్త.

గోళెందగ్గర కాళ్ళు కడుక్కుని లోపలికి వెళ్ళాను. లోపలికి అడుగు పెట్టగానే ఊహించని దృశ్యం నా కళ్ళముందు భయంకరంగా కనబడింది. నా మనస్సు కకావికలమైపోయింది. నా పిడికెడు గుండెలో పిడుగులు పడ్డట్టుగా ఉంది. కళ్ళుమూసుకొని అక్కడికక్కడే చతికిలబడిపోయాను.

వెన్నెల్లో గోదారిలా మెరిసిపోయే గంగ వైధవ్యంతో యిలా... నాలో దుఃఖం కట్టలుతెంచుకుంది. మరుక్షణంలో నా గుండెలో కన్నీటి మబ్బులు కురిసినియ్యి. మావయ్య నాదగ్గర నిశ్శబ్దంగా నుంచొని వున్నాడు. "గోపన్న కీళ్ళజబ్బుతో చాన్నాళ్లు బాధపడ్డాడు. నువ్వు పంపిన డబ్బంతా ఆడి జబ్బుకే ఖర్చుపెట్టాం. అయినా ఆ దేముడు కరుణించలేదు. వెళ్ళిపోయాడు". పొంగుకొస్తున్న దుఃఖాన్ని నోట్లో పమిటకొంగు కుక్కుకొని ఆపుకొనే ప్రయత్నం చేసింది సీతత్త. "ఇంత జరిగినా నాకెందుకు చెప్పలేదు" వాళ్ళమీద అరిచాను. "దేశం గాని దేశంలోవున్న నీకు ఈ విషయం చెపితే తట్టుకోలేవని..." అన్నాడు మావయ్య.

ఒక్క క్షణంకూడా అక్కడ ఉండలేకపోయాను. గోదారి గట్టుకు వచ్చి గోదారిలో కట్టేసి ఉన్న మావయ్య పడవలో కూర్చొండిపోయాను. ఎప్పుడూ అందంగా కనిపించే గోదారి ఇప్పుడు దానికి విరుద్ధంగా కన్పిస్తూ వుంది నా కంటికి. కొన్ని గంటల పాటు ఉలుకుపలుకు లేకుండా ఆ పడవలోనే కూర్చుండిపోయాను. సూర్యుడు నడి నెత్తిమీదకొచ్చి తన ప్రతాపాన్ని చూపిస్తున్న నాకు కదలబుద్ధికాలేదు. చాలా సేపటి తరువాత నన్ను వెతుక్కుంటూ వచ్చిన మావయ్యతో ఇంటికి వెళ్ళాను.

ఇక ఆ రాత్రి నిద్దరపట్టలేదు. నులక మంచంమీద అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాను. తెల్లారి పెళ్ళిచూపులకి వెళ్ళాలని మావయ్య చెప్పాడు. ఎప్పటికో నిద్దరపట్టింది.

తెల్లారుజామునే మావయ్య నన్ను లేపాడు. అప్పటికే మావయ్య, సీతత్త తయారుగా ఉన్నారు. ఇద్దరు పెద్దమనుషులు కూడా మాతో రావడానికి తయారయ్యి వచ్చారు. గంగ లోపల ఏదో పనిచేసుకుంటూ ఉంది. "సూరి త్వరగా ప్రయానమవ్వు"అంటూ కేకేసాడు మావయ్య. నేను మంచం మీదనుండి లేచి కుర్చొని "మావయ్యా...నీతో మాట్లాడాలి" అన్నాను. "ఏరా నాన్న... ఒంట్లో బాగా లేదా!" అంటూ నా దగ్గరకు వచ్చి నా నుదుటి మీద చెయ్యి వేసింది సీతత్త. "అదేంకాదు సీతత్త. ఈ పెళ్ళిచూపులు వద్దు"అన్నాను. అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నామాట విన్న గంగ విసురుగా గుమ్మం దగ్గరకు వచ్చింది.

"అదేంట్రా...మనం వస్తున్నామని నిన్ననే కబురు కూడా పంపేసాం కదా!"అన్నాడు మావయ్య కంగారుగా. "అక్కడ ఎవరినైనా ఇష్టపడ్డావేంట్రా సూరి"అంటూ లాలనగా అడిగింది సీతత్త. "అదేం కాదు సీతత్త. నేను చెప్పేది వినండి. నేను గంగని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. మీతో నేను కలిసి కలకాలం ఉండాలంటే గంగని నాకిచ్చి పెళ్ళిచేయండి. నామాటకాదంటే వెళ్ళిపోతాను. ఇక ఈ జన్మలో ఊళ్ళో అడుగుపెట్టను" కాస్తంత విసురుగానే అన్నాను ఆ మాట.

ఆ మాటతో అక్కడి వాతావరణం నిశ్శబ్దమైయ్యిపోయింది. కొంతసేపటి తర్వాత పెద్దమనుష్యుల్లో ఒకాయన మావయ్య దగ్గరకొచ్చి "ఒరేయ్ నరసయ్య వాడు చెప్పింది నాకు సబబుగానే ఉందిరా! ఆలోచించుకో!" అన్నాడు.

మావయ్య చాలాసేపు మౌనంగానే ఉన్నాడు. సీతత్తది అదే పరిస్థితి. గంగ గుమ్మంలో చతికిలబడిపోయింది. కొన్ని నిమిషాలు జరిగిన తర్వాత మావయ్య నాదగ్గరకొచ్చి నన్ను హత్తుకుపోయాడు. తన కన్నీళ్ళతో నా చొక్కాని తడిపేసాడు. సీతత్త ప్రేమతో నా నుదుటిపై ముద్దు పెట్టుకుంది.

మా వైపే చూస్తూ ఉన్న గంగవైపు నేను చూసి చిన్నగా నవ్వాను. తను కూడా నవ్వింది. ఆ నవ్వు వెన్నెల్లో మెరిసిపోతూ దూరంగా కన్పిస్తున్న గోదారిలా ఉంది. సిగ్గుతో గంగ లోపలికి వెళ్ళిపోయింది. ఈ మంచి మనుషుల రుణం ఈ రూపాన తీర్చుకోవటం నా అదృష్టం

ఇప్పుడు నాలో ఉత్సాహం నెమలి పింఛంలా విచ్చుకుంది. "అమ్మతో చెప్పాలి. గంగ నీ కోడలని..." ఆనందంతో అమ్మలాంటి గోదారివైపు పరుగుతీసాను.

❋

రచయిత చిరునామా:
గంటా ముత్యాలరావు,
అయ్యప్ప మెడికల్స్ అండ్ జనరల్ స్టోర్స్,
మఠంవీధి, పాలకొల్లు- 534 260.

